అబాకస్‌లో చిన్నారి ప్రతిభ

గచ్చిబౌలి: అబాకస్‌లో రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానం, జిల్లాస్థాయిలో మొదటి స్థానం సాధించి ప్రతిభ చాటుకున్నాడు విద్యార్థి. కొండాపూర్‌లోని సంస్కృతి హైస్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న ఫజల్ ఖాన్ కూకట్‌పల్లిలో విశ్వం ఎడ్యుటెక్ నిర్వహించిన అబాకస్ స్టార్ జూనియర్ లెవల్ పరీక్షల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానం, రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానం సాధించాడు. బుధవారం స్కూల్స్ చైర్మన్ లక్ష్మణ్ రావు విద్యార్థికి సర్టిఫికెట్ అందజేశారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



షేక్ సమీరా బేగంకు మంజూరుపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ కాలనీకి చెందిన షేక్ సమీరాబేగంకు వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి రూ.2.50 లక్షలు మంజూరుపత్రాన్ని గురువారం ఎమ్మెల్యే గాంధీ బాధిత కుటుంబానికి అందజేశారు.పేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భరోసానిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్లు బదిలీ

గచ్చిబౌలి: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలువురు ఇన్‌స్పెక్టర్లను కమిషనర్ అవినాష్ మహంతి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న ఎస్.రాజశేఖర్ రెడ్డిని కేపీహెచ్‌బీ ఎస్‌హెచ్‌ఓగా, ఆయన స్థానంలో రాజేంద్రనగర్ ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.సురేష్ బదిలీపై వచ్చారు. గచ్చిబౌలి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పి.రాజేష్‌ను కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు. అక్కడ పని చేస్తున్న కొత్తపల్లి ముత్తును సీటీసీకి బదిలీ చేశారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ అభివృద్ధికి నిధులను మంజూరు చేయాలని కోరుతూ గురువారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ కె.ఇలంబర్తిను ఆయన కార్యాలయంలో కార్పొరేటర్ పుష్ప కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రధాన సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకుపోయామని సీసీ రోడ్లతో పాటు పలు అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా రామచంద్రాపురం డివిజన్‌లో పర్యటించాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు.

'హామీల అమలులో కాలయాపన'

శేరిలింగంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఎన్నికల హామీలు, పథకాలను అమలుచేయడంలో కాలయాపన చేస్తోందని బీజేపీ సీనియర్ నాయకులు నీరటి చంద్రమోహన్ గురువారం విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే స్థితిలో లేరన్నారు.పేద ప్రజలను ఆదుకునేది బీజేపీ మాత్రమే అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.

10న భవిష్యనిధి అదాలత్

మూసాపేట: మూసాపేటలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం ఆధ్వర్యంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డాక్టర్ హేమంత్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని బస్ టెర్మినల్‌లో రెండో అంతస్తులోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. కూకట్‌పల్లి, జీడిమెట్ల, సనత్‌నగర్, బీహెచ్‌ఈఎల్ తదితర ఖాతాదారులు పాల్గొనాలని కోరారు.

10న ఉచిత వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: మెడ, నడుము, వెన్నుముక నొప్పితో బాధపడుతున్న వారికి కూకట్‌పల్లిలోని రాందేవ్ రావ్ ఆసుపత్రిలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్స్‌రే, న్యూరోపతి టెస్ట్, సీబీపీ, ఈఎస్ఆర్, సీఆర్‌పీ, ఎస్ఆర్ యూరిక్, ఎస్ఆర్‌ఆర్‌బిటీబీ 12డీ, ఆర్‌ఏ ఫ్యాక్టర్‌కు చికిత్స చేయనున్నట్లు తెలిపారు.వైద్యుల సలహా మేరకు సిటీ స్కాన్ 2, ఎమ్మారై స్కాన్ 2 వేలుకు చేయబడుతుందని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

నిజాంపేట్ : బాచుపల్లి మండలం రాజీవ్‌గాంధీ నగర్‌లో అక్రమ నిర్మాణాలను గురువారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. కొద్ది రోజులుగా అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు చర్యలు తీసుకున్నారు.

రోడ్ల విస్తరణ చేపట్టాల్సిందే..

- ఐటీ ట్రాఫిక్‌కు పరిష్కారం.. మాస్టర్ ప్లాన్
- ప్రజారవాణాను ప్రోత్సహించాలి



గచ్చిబౌలి స్టేడియం రోడ్డులో ట్రాఫిక్ జాం

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో విశాలమైన రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్ పాస్ తదితర మౌలిక వసతులున్నా నిత్యం అడుగడుగునా ట్రాఫిక్ జామ్ తప్పడం లేదు. ఐటీ, ఐటీ ఆధారిత ఉద్యోగులు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే గడపాల్సి వస్తుంది. మాస్టర్ ప్లాన్ మేరకు ప్రధాన రహదారుల విస్తరణ చేపట్టకపోవడంతో సమస్య తప్పడం లేదు. ఉదయం, సాయంత్రం సమయంలో లక్షలాది వాహనాల రాకపోకలతో ఐటీ కారిడార్‌ను ట్రాఫిక్ సమస్య వీడడం లేదు. మాదాపూర్, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఐటీ కంపెనీలకు ప్రతి రోజు ఐటీ, ఐటీయేతర ఉద్యోగులు దాదాపు 10 లక్షల మంది రాకపోకలు చేస్తుండడంతో ఐటీ కారిడార్‌కు వచ్చే అన్ని రహదారులు ట్రాఫిక్ మయంగా మారుతున్నాయి. వాహనదారులు ఉదయం, సాయంత్రం సమయాల్లో గంటల తరబడి ట్రాఫిక్‌లోనే గడుతున్నారు. ఇప్పటికీ కొన్ని కంపెనీలు హైబ్రిడ్ విధానంలో ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం అవకాశం కల్పించాయి. సోమవారం, బుధవారం, శుక్రవారం ఉద్యోగులంతా హాజరు కావాల్సి ఉంటుంది. ఆ మూడు రోజుల్లో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతుంది.

మౌలిక వసతులు ఉన్నా..

సైబర్‌టవర్, బయోడైవర్సిటీ, రాయదుర్గం, శిల్పా లేవుట్, గోపన్‌పల్లి, మైండ్‌స్పేస్ జంక్షన్, కొత్తగూడ, కేబుల్ బ్రిడ్జి తదితర ప్రాంతాలలో 10 ఫ్లైఓవర్లు ఉన్నాయి. ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వైపు, చందానగర్‌లో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్‌లు నిర్మాణ దశలో ఉన్నాయి. అంతే కాకుండా హఫీజ్‌పేట్, హైటెక్‌సిటీ, నల్లగండ్లలో ఆర్‌ఓబీలు, కొత్తగూడ, మైండ్ స్పేస్, శిల్పారామం, కేపీహెచ్‌బీలలో నాలుగు అండర్‌పాస్‌లు ఉన్నాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 14 లింక్ రోడ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయినప్పటికీ ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది.



కొత్తగూడ ఫ్లైఓవర్‌పై నిలిచిపోయిన వాహనాలు



ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో..

ప్రజారవాణా మెరుగుపడాలి

ఐటీ ఉద్యోగులు ఎక్కువగా సొంత బైక్‌లు, కార్లలో వస్తున్నారు. తక్కువ సంఖ్యలో క్యాబ్‌లు, బస్సులలో వెళుతున్నారు. వ్యక్తిగత వాహనాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ జాం నెలకొంటుంది. రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు, మియాపూర్ నుంచి హైటెక్‌సిటీ, ఆల్విన్ కాలనీ నుంచి గచ్చిబౌలి జంక్షన్‌కు మెట్రో రైల్ అందుబాటులో ఉంటే ట్రాఫిక్ తగ్గే అవకాశం ఉంది.

ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు ఇవే..

- షేక్‌పేట్ నాలా నుంచి రాయదుర్గం పోలీస్‌స్టేషన్ వరకు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి.
- నానక్‌రాంగూడ రోటరీ నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు ఉదయం పూట ట్రాఫిక్ జామ్ నెలకొంటుంది. గచ్చిబౌలి స్టేడియం నుంచి ట్రిపుల్ ఐటీ జంక్షన్ వరకు ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు.
- ఆల్విన్ కాలనీ జంక్షన్ నుంచి గచ్చిబౌలి వరకు ప్రతిరోజు ట్రాఫిక్ జాం ఉంటోంది.
- నల్లగండ్ల ఫ్లై ఓవర్ నుంచి గుల్‌మొహర్ కాలనీ జంక్షన్ వరకు వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి నుంచి మాదాపూర్‌లోని కాకతీయహిల్స్ వరకు ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది.
- హైటెక్ సిటీ ఆర్‌ఓబీ నుంచి మైండ్‌స్పేస్ వరకు కిలోమీటర్ల పొడవునా వాహనాలు బారులుదీరుతున్నాయి
- కొండాపూర్‌లోని శ్రీరాంనగర్‌లో.. ఇక ఆల్విన్ కాలనీ జంక్షన్ ట్రాఫిక్ జాంలోనే ఉంటోంది.

విస్తరించాల్సిన మాస్టర్ ప్లాన్ రోడ్లు

- నానల్‌నగర్ నుంచి బీహెచ్‌ఈఎల్ క్రాస్ రోడ్డు వరకు 210 అడుగుల ఉండాల్సి ఉండగా 120 అడుగులకే పరిమితమైంది. డోయన్స్ కాలనీ, ఆలిండ్ ఫ్యాక్టరీ వద్ద కేవలం 100 అడుగులు మాత్రమే ఉంది.
- గచ్చిబౌలి జంక్షనుంచి హైటెక్‌సిటీ ఆర్‌ఓబీ వరకు 150 అడుగుల రోడ్డుకు కేవలం 120 అడుగులు ఉంది. ఇటీవల ఒక వైపు యశోద హాస్పిటల్ వరకు రోడ్డును విస్తరించారు.
- బొటానికల్ గార్డెన్ నుంచి హెచ్‌సీయూ డిపో వరకు 80 అడుగులకే పరిమితం చేశారు. 120 అడుగుల మేర విస్తరణ చేపడితేనే ట్రాఫిక్ ఉపశమనం కలిగే అవకాశం ఉంది.

ఐటీ కారిడార్‌కు వచ్చే అన్ని వైపులా ప్లాన్ ప్రకారం రోడ్డును విస్తరిస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. తాజా పరిస్థితులకు అనుగుణంగా కొత్తగా మాస్టర్ ప్లాన్ వేస్తేనే శాశ్వత పరిష్కారం కలుగుతుంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చందానగర్: మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- మాధవనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 వరకు మాతృశ్రీనగర్ కొంతభాగం, ఓల్డ్ సొసైటీ, ఎస్‌బీఐ, మాధవనగర్ కొంత భాగం ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- మాతృశ్రీనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.00 వరకు మాతృశ్రీనగర్ కొంత భాగం, టెంపుల్ పార్క్, విజేత సూపర్‌మార్కెట్ ప్రాంతాలలో..

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

- భిక్షపతి ఫీడర్ల పరిధిలో.. ఉ.11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు కైలాష్‌నగర్, టిక్నో అపార్ట్‌మెంట్స్, జవహర్ కాలనీ రోడ్డు నంబర్లు 4,5,6, శ్రీదేవి థియేటర్ ఎదురు ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

మియాపూర్‌లో..

మియాపూర్: కేంద్రీయ విహార్, రాంనరేష్ ఫీడర్ల మరమ్మతుల శుక్రవారం ఉ.11గంటల నుండి మ. 2 గంటల వరకు కేంద్రీయ విహార్, రత్నదీప్ బ్యాక్‌సైడ్, మయూరినగర్, అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఏఎస్ రాజునగర్, మిత్ర హిల్స్, ప్రశాంత్‌నగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ రవిచంద్ర తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-4, ఓల్డ్ గచ్చిబౌలి స్ట్రీట్ నంబర్ 3, యూనివర్సల్ రియల్టర్స్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంబిక సూపర్ మార్కెట్, పెద్దమ్మ టెంపుల్, బీఎస్ చౌరస్తా, వెంకటేశ్వర స్వామి టెంపుల్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ భాస్కర్ తెలిపారు.

పబ్‌లు, హోటళ్లలో భద్రతా చర్యలు తీసుకోవాలి

మాదాపూర్ డీసీపీ వినీత్



పబ్‌లు, హోటళ్లలో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తున్న డీసీపీ వినీత్

గచ్చిబౌలి: ప్రిజం పబ్‌లో నిందితుడు బత్తుల ప్రభాకర్ కాల్పుల నేపథ్యంలో మాదాపూర్ జోన్ పోలీసులు అప్రమత్తమయ్యారు. పబ్‌లు, హోటళ్లలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని డీసీపీ డాక్టర్ వినీత్ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో మాదాపూర్ జోన్‌లోని పబ్‌లు, బార్‌లు, హోటళ్ల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 1న ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ప్రిజం పబ్‌లో సీసీఎస్ కానిస్టేబుళ్లపై బత్తుల ప్రభాకర్ కాల్పుల నేపథ్యంలో అందరు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందన్నారు. పబ్‌లు, హోటళ్లు, బార్‌లలో అన్ని ప్రాంతాలు కనిపించేలా సీసీ కెమెరాలను అమర్చాలని పార్కింగ్‌ల్లోనూ సీసీ కెమెరాలు ఉంచాలన్నారు. శిక్షణ తీసుకున్న వారిని మాత్రమే సెక్యూరిటీగా నియమించుకోవాలని పేర్కొన్నారు. తనిఖీల సమయంలో వెపన్స్, కత్తులతో పాటు ఇతర వస్తువులు కనిపించినా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నా డయల్ 100, సంబంధిత పీఎస్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాం, ఏసీపీ సీహెచ్ వెంకన్న, ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ వెంకన్న, కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 15, పచ్చిమిర్చి 45, బెండ 50, కాకర 50, దొండ 40, దోస 50, ఆలు 30, చామ 50, కీర 40, బీర 60, వంకాయ 30, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 40, చిక్కుడు 40, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 300.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి




చందానగర్ : గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గురువారం లింగంపల్లి రైల్వే స్టేషన్ 6వ నంబర్ ప్లాట్ ఫారం పార్కింగ్ ఏరియా సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు (60) పడి ఉండడాన్ని గమనించారు. వెంటనే చందానగర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా14 మందికి రూ.2 వేల చొప్పున జరిమానా, మరో ఇద్దరికి రూ. 1000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

రంగనాథస్వామి పల్లకీ సేవ



రాయదుర్గం: నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఆలయంలో బాలభోగ, అర్చన, బలిహరణ, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అంతకుముందు ఆలయంలో లక్ష్మీ దేవి అమ్మవారికి అర్చనలు, అభిషేకం చేశారు. కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

రాంనరేష్ నగర్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా..

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఎమ్మెల్యే గాంధీని కలిసిన రాంనరేష్‌నగర్ కాలనీవాసులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్ నగర్ కాలనీవాసులు పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గురువారం ఎమ్మెల్యే గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ త్వరలో రాంనరేష్ నగర్ కాలనీలో పర్యటిస్తానని చెప్పారు. దశలవారీగా రోడ్ల పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పోతుల రాజేందర్, కాలనీవాసులు చాట్ల రవి, చెట్టి సత్యనారాయణ, నక్కా సరేష్, చంద్రయ్య, నాగార్జున రెడ్డి, నారాయణ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

గొలుసు లాక్కెళ్లాడు కానీ నిమిషాల్లోనే పట్టుబడ్డాడు

స్థానికులను అభినందించిన పోలీసులు

గచ్చిబౌలి: ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన చైన్‌స్నాచర్ నిమిషాల వ్యవధిలోనే పట్టుబడ్డాడు. గురువారం రాత్రి 8.30గంటల సమయంలో జేవీకాలనీలో ఓ మహిళ(38) నడుచుకుంటూ వెళ్తోంది. అటుగా బైక్‌పై వచ్చిన యువకుడు ఆమె మెడలోని గొలుసును లాక్కుని పారిపోయాడు. దీనిని గమనించిన కొందరు స్థానికులు వెంబడించి కొద్ది దూరంలో పట్టుకున్నారు. అప్పటికే డయల్ 100కు కాల్ చేయగా, పోలీసులు వచ్చారు. నిందితుడు రిత్విక్‌ను పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని వెంబడించి చాకచక్యంగా పట్టుకున్న స్థానికులను పోలీసులు అభినందించారు.

మల్లన్న జాతరకు ఏర్పాట్లు పూర్తి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్న బస్తీలో నిర్వహించే మల్లికార్జున స్వామి జాతరకు సర్వం సిద్ధం చేశారు. శనివారం నుండి మూడు రోజులపాటు సాగే ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు చంద్రారెడ్డి తెలిపారు. మొదటిరోజు గంగపటం, రెండవ రోజు కల్యాణం, మూడవరోజు నాగవల్లి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

వాటర్ ట్యాంకర్ ఢీ.. ఒకరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

గచ్చిబౌలి: వేగంగా వచ్చిన ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కొల్లూరు మండలం, చెన్నూరుకు చెందిన పెనుగొండ గోపాలకృష్ణ(33) బతుకు దెరువు కోసం ఐదేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి గౌలిదొడ్డి కేశవ్‌నగర్‌లో ఉంటూ కూలీ పనులు చేస్తుంటాడు. డ్రంకెన్‌డ్రైవ్ కేసులో బుధవారం కూకట్‌పల్లి కోర్టుకు వెళ్లాడు. తిరిగి శ్రీకాంత్(30)అనే వ్యక్తి గోపాలకృష్ణను తీసుకొని మధ్యాహ్నం 12.30 గంటలకు తిరిగి వస్తుండగా మసీద్‌బండ సమీపంలో వాటర్ ట్యాంకర్ ఢీ కొట్టింది. దీంతో గోపాలకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పన్ను పోటు.. ప్రజలు గగ్గోలు!

- మణికొండలో అడ్డగోలుగా పెరిగిన ఆస్తిపన్ను
- ఐదు రెట్లు పెంచటంతో లబోదిబోమంటున్న ప్రజలు
- భువన్ సర్వే తీరుపై సర్వత్రా నిరసన
- చట్టవిరుద్ధం అంటున్న ప్రజలు
- రాష్ట్రమంతటా పెరిగిందంటున్న అధికారులు



మణికొండ మున్సిపల్ కార్యాలయం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీలో కొన్ని ఇళ్లపై మున్సిపల్ అధికారులు పన్నుపోటు వేశారు. గత సంవత్సరం వరకు ఉన్న ఆస్తి పన్నును ఏకంగా ఐదు రెట్లు పెంచటంతో వారు లబోదిబోమంటున్నారు. మున్సిపల్ చట్టం 2019, కోర్టు తీర్పులకు ఇది విరుద్ధమని పలువురు వాదిస్తున్నారు. గత సంవత్సరం వరకు రూ. వందల్లో ఉన్న తమ ఇంటి పన్నును ఏకంగా రూ. వేలల్లో పెంచారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- హైదరాబాద్ నగర శివార్లలో మున్సిపాలిటీలు ఏర్పాటు కాకముందు గ్రామ పంచాయతీల పాలన కొనసాగింది. అందులో భూమి రిజిస్ట్రేషన్ విలువ, ఇంటి నిర్మాణం తీరు, విలువను బట్టి పన్నులు వేసే వారు. అది రూ. వందల్లో మాత్రమే ఉండేది. మున్సిపాలిటీలు అవతరించిన తరువాత అప్పటి నుంచి వచ్చే నిర్మాణాలకు వారి నిబంధనల ప్రకారం పన్నులు వేసే వారు. పాత గృహాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సంవత్సరాల పాటు ఎలాంటి పన్ను పెంపు ఉండదని మినహాయింపు ఇచ్చింది. దాంతో వారికి పెద్దగా మార్పులు లేకుండానే పన్నులు వేయటం, వారు చెల్లించటం జరిగిపోయింది.

భువన్ సర్వేతో...

మున్సిపాలిటీలలో పెద్ద గృహాలు ఉన్నా కొన్ని గృహాలకు తక్కువ పన్నులు ఉన్నాయని మున్సిపల్ ఉన్నతాధికారులు రెండు సంవత్సరాల క్రితం గుర్తించారు. ఎలాగో ప్రభుత్వం ఇచ్చిన మూడు సంవత్సరాల రాయితీ గడువు ముగిసిపోవటంతో అన్ని గృహాల పన్నును సమంగా చేయాలని నిర్ణయించారు. దాంతో భువన్ సర్వే చేపట్టారు. సర్వే నిమిత్తం వచ్చిన సిబ్బంది నెలల తరబడి మున్సిపాలిటీల్లోనే ఉండి ప్రతి ఇంటి కొలతలను తీసి ఆన్‌లైన్ యాప్‌లో నిక్షిప్తం చేశారు. దాంతో ఉన్న కొలతలు, వస్తున్న ఇంటి పన్నును మార్పులు చేసి కొత్త పన్నును విధించాలని నిర్ణయించారు. ఇతర మున్సిపాలిటీలలో భూ విలువ, నిర్మాణ విలువ అంతంత మాత్రంగా ఉండటంతో పన్నులలో పెద్దగా పెంపు జరగకపోవటంతో ప్రజలు అంతగా పట్టించుకోలేదు. అదే మణికొండ మున్సిపాలిటీ పరిధిలో గజం భూమి విలువ మణికొండ గ్రామానికి రూ. 22 వేలు, పుప్పాలగూడకు రూ. 18 వేలు, నెక్నాంపూర్‌కు రూ. 13.500లు రిజిస్ట్రేషన్ విలువ ఉండటంతో భువన్ సర్వే ఆధారంగా పన్నులు అమాంతం పెరిగిపోయాయి.

- 2024–25వ సంవత్సరం పన్నులోనూ ఆరు నెలల వరకు పాత పన్ను ఉండగా మిగిలిన ఆరు నెలలకు మాత్రం కొత్త పన్ను వచ్చింది. సంవత్సరం పన్ను మొత్తం చెల్లించిన వారికి సైతం కొత్తగా పెరిగిన మొత్తం బకాయిగా చూయిస్తుంది. దాంతో ఆయా గృహాల యజమానులు ఒకేసారి ఇంతలా పన్నులు పెరగటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ చట్టం–2019 (100)2, 4 ప్రకారం ఇంటి పన్నులను మదింపు చేసే సమయంలో తమకు నోటీసు ఇవ్వటం, తమ ఆక్షేపణలను నమోదు చేయలేదని పలువురు పేర్కొన్నారు. పెరిగిన పన్నును వెంటనే చెల్లించాలని సిబ్బంది ఒత్తిడి తెస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే విషయాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, మేనేజర్ కె.శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లారు.

కోర్టు తీర్పులకు విరుద్ధం

ఆస్తి పన్నును అధికారులు, ప్రభుత్వం ఏ కారణాలతోనైనా సంవత్సరం వారీగా పెంచకపోతే అది వారి తప్పుగానే పరిగణించాలని కోర్టు గతంలో పలు కేసులలో పేర్కొంది. పెంచే సమయంలో ఉన్న పన్నును రెట్టింపుకంటే అధికంగా పెంచకూడదనే తీర్పులు ఉన్నాయి. వాటికి విరుద్ధంగా మున్సిపల్ చట్ట నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా ఐదింతల మేర పన్ను పెంచటం దారుణం. ఈ విషయంలో మరోమారు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధం అవుతున్నాం.

–డి.సీతారాందాస్, హుడా కాలనీ, మణికొండ

ఇన్ని రెట్లు పెంచడం సరికాదు

సగానికిపైగా గృహాలకు పన్నులు పెరిగాయి. ఒక్కసారిగా తమ ఇంటి పన్ను అంతలా ఎందుకు పెరిగిందో అర్థం కాని పరిస్థితి. తమ ఇంటి స్థలాలు, చదరపు అడుగులు తప్పుగా నమోదు అయి పన్ను ఎక్కువగా వచ్చిన వారు మున్సిపాలిటీ కార్యాలయంలో ఆక్షేపణలు ఇవ్వాలి. ఒక్కసారిగా ఇన్ని రెట్లు పన్ను పెంచటం పద్ధతి కాదు. ఈ విషయాన్ని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– వి.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి, ఆల్ కాలనీస్ ఫెడరేషన్